# ఏప్రిల్ ఫూల్

ఆదివారం.

ఏప్రిల్ ఫస్ట్.

ఉదయాన్నే అమ్మ ఇచ్చిన టిఫిన్ తిన్న రాజు రోడ్డు మీదకు వచ్చాడు.

ఎక్కడికి వెళ్లాలో పాలుపోలేదు.

రోడ్డు మీద జన సంచారం తక్కువగా ఉంది.

రోడ్డుకి పక్కగా ఇనుపగొట్టం పాతి దానికి కోయిన్ ఫోన్ బాక్స్ బిగి ఉంది.

టీవీలో నిత్యం సినిమా నటుల నుండి రాజకీయ నాయకుల వరకూ ప్రచారం ఇస్తున్న ప్రకటన గుర్తు వచ్చింది.

రాజు మనసులో చిలిపి కోరిక కలిగింది. 'ఎవరిని ఏప్రిల్ ఫూల్ చేయాలి?' జేబులో చిల్లర కోసం చూసుకున్నాడు. మూడు ఒక రూపాయి బిళ్లలు, ఒక ఐదు రూపాయిల బిళ్ల ఉన్నాయి.

వెంటనే కోయిన్ ఫోన్ బాక్స్‌ను సమీపించి అటూ ఇటూ చూశాడు. పరిసరాల్లో ఎవరూ లేకపోవడంతో రిసీవర్ అందుకుని 'కోయిన్ ప్లీజ్' అని రాగానే చేతిలో ఉన్న రూపాయి బిళ్లను వేసి అత్యవసర వైద్య సేవలందించే 108 అంబులెన్స్ విభాగానికి ఫోన్ చేసి, జానకిరాం పీవర్పుకాలనీలో, రామాలయం పక్కనున్న ఇంట్లోని వ్యక్తికి ప్రమాదంగా ఉంది. అత్యవసర సేవలందించాలి అని చెప్పి రిసీవర్ పెట్టేశాడు రాజు.

అరగంట పాటు అక్కడకు కొద్ది చేరువలో ఉన్న కిళ్లీ బడ్డీ ముందున్న బెంచీ మీద కూర్చుని పేపరు తిరగవేస్తూ ఓ కంట రోడ్డున పోతున్న వాహనాలను పరికిస్తున్నాడు.

అరగంట దాటింది.


దూరం నుండి ఎమర్జెన్సీ హారన్ మోతతో 108 అంబులెన్సు శరవేగంతో దూసుకుపోవడం కంట పడింది.

రాజు లోలోపల నవ్వుకుంటూ పేపర్ని బల్లమీద పడేసి గొప్ప ఘనకార్యం సాధించిన వాడిలా ఇంటి ముఖం పట్టాడు.

రాజు ఇల్లు చేరేసరికి, ఇంటి ముందు వీధిలో ఉండే కొందరు ఆడా, మగాలు గుమికూడి ఉన్నారు.

క్షణం ఆశ్చర్యపోయిన రాజు "ఏంటి ఇంతమంది గుమ్మంలోకి చేరారు" అనుకుంటూ చేరువయ్యాడు.

ఇంట్లోంచి అమ్మ ఏడుపు పెద్దగా వినిపించింది. భయం వేసింది. ఏమై ఉంటుంది? అమ్మ ఏడుపేంటి? అనుకుంటూ అక్కడవాళ్లను తప్పించుకుంటూ అడుగులు వేశాడు.



"పాపం. ఇంతకు ముందే డ్యూటీ నుండి వచ్చాట్ట. అంకమ్మ 'టీ' కలిపి అందించిందట. టీ ఒక గుక్క నోట్లోకి వెళ్లిందో లేదో పక్కకి వాలిపోయాడట.." ఎవరో ఒకతను ఇంట్లోంచి బయటకు వస్తూ అన్నాడు.

ఆ మాట చెవులోకి చొచ్చుకుపోయింది. "ఏంటయింది మా నాన్నకు?" గాబరాగా అడిగాడు.

"నువ్వెక్కడకి పోయేవురా! మీ నాన్నకి గుండె నొప్పి వచ్చింది" ఎవరో చెప్పారు.

"వేణూ 108 అంబులెన్సుకి ఫోన్ చేశావా! వాళ్లు వస్తున్నారా?" అప్పుడే అక్కడ అడుగుపెట్టిన వేణూని అడిగాడో పెద్దాయన.

"చేశాను. కానీ అంబులెన్సు మరో సీరియస్ కేసు నిమిత్తం జయరాం కాలనీకి వెళ్లిందట. ఇప్పుడే." చెప్పాడు వేణూ.

అందరి ముఖాల్లోనూ నిరాశ కొట్టొచ్చినట్లు కనిపించింది.

"అదీ ఇప్పుడే పోవాలా!" మరొకరెవరో జాలిగా అనడం రాజుకి వినిపించింది.

"అంతా అయిపోయింది దేవుడో! నా మొగుణ్ని దేవుడు తీసుకు పోయాడురో!" లోపల్నించి అమ్మ రోదన భయంకరంగా వినిపించింది.

రాజు ఖిన్నుడైపోయాడు. తను చేసిన ఆకతాయి ఫోన్ కారణంగా తండ్రి ప్రాణాల్ని కాపాడుకోలేకపోయానన్న దుఃఖం పెల్లుబికి వచ్చింది. కుప్పకూలిపోయాడు నిలిచిన చోటనే. ఎవరినో ఏప్రిల్ ఫూల్ చేయడానికి, చేసిన ఆకతాయి ఫోన్ కారణంగా, తనే ఫూల్ కావాల్సి వచ్చినందుకు మనసులో తిట్టుకున్నాడు రాజు.

**-పి.జి.కె.మూర్తి** (విశాఖపట్నం)

